




epaper.telanganachowrasta.com
www.telanganachowrasta.com

# తెలంగాణ చౌరస్తా

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02
సంచిక:35

24 క్యారెట్లు 158,950.00 | కిలో వెండి 2,60,000.00 | chourastha Digitals | 20.09.2026 ఆదివారం, హైదరాబాద్


- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- బస్సు యాత్రగా జన్వాడ ఫాంహౌస్‌కు కాంగ్రెస్ నేతలు
- బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం..ఉద్రిక్తత
- ప్రదీప్‌రెడ్డికి ఈ ఫాంహౌస్ భూమి ఎలా వచ్చిందో విచారించాలి
- పురపాలక శాఖ మంత్రిగా కేటీఆర్ అనేక అక్రమాలు
- కేటీఆర్ ఈ ఫామ్‌హౌస్‌ను లీజుపై అనుమానాలున్నాయి



# నాలా కబ్జా చేసి జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ ఫాంహౌస్‌పై కాంగ్రెస్ ఎంపీలు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫాంహౌస్ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా నాలాపైనే ఈ ఫాం హౌస్ నిర్మించారని కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఆరోపించారు. శనివారం నాడు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేల ప్రతినిధి బృందం బస్సు యాత్ర చేపట్టి జన్వాడ ఫాంహౌస్‌కు చేరుకుని అక్కడి భూములను, నిర్మాణాలను పరిశీలించేందుకు ప్రయత్నించింది. బీఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేయగా ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## హైడ్రా చర్యలు తీసుకోవాలి

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తమ బృందం ఫాంహౌస్ దగ్గరకు వస్తే కేసులు పెడతామని యజమానిగా చెప్పుకుంటున్న ప్రదీప్‌రెడ్డి అనడం సరికాదన్నారు. ఇన్ని ఎకరాల విస్తీర్ణంలో అసలు ఫాంహౌస్ ఎలా నిర్మించారో స్పష్టం చేయాలని, కేటీఆర్ స్నేహితుడైన ప్రదీప్‌రెడ్డికి అసలు ఈ ఫాంహౌస్ భూమి ఎలా వచ్చిందో విచారణ జరగాలన్నారు. గతంలో జన్వాడ ఫాంహౌస్ దృశ్యాల కోసం డ్రోన్ ఎగరవేస్తే రేవంత్‌రెడ్డిపై అక్రమంగా కేసులు పెట్టారని మండిపడ్డారు.కేటీఆర్ కేవలం అద్దెకు మాత్రమే ఉంటున్నారని ప్రదీప్ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు. కేటీఆర్ ఈ ఫామ్‌హౌస్‌ను లీజుకు తీసుకున్నట్లు చెబుతున్నప్పటికీ,

।మిగతా 2 లో।

# జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్ సొత్తు కాదు

## దానికి అసలైన యజమానిని నేను

- అనుమతి లేకుండా తన ఆస్తిలోకి ప్రవేశిస్తే చట్టపరమైన కేసులు
- కేటీఆర్ స్నేహితులు ప్రదీప్‌రెడ్డి
- ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటన
- సీఎం ఆదేశాలతో ఎర్రవల్లి ఫామ్ హౌస్ ఆస్తులు
- వివరాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన

2లో





## జన్వాడ ఫాంహౌస్‌పై కేటీఆర్ రియాక్షన్

రాష్ట్రంలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వం

మేం ఏదైనా తప్పుచేసినట్టు తేలితే..
ఎలాంటి చర్యలు తీసుకున్నా సిద్ధం
అధికారం మీ చేతుల్లోనే ఉంది
అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోండి
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



## విద్యార్థులే దేశ భవిష్యత్తు

- విద్యార్థుల్లేకుండా ఏ దేశమూ గొప్పగా ఎదగలేదు
- లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ
- దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీ
- విద్యార్థులు ప్రశ్నించడం ఆ సిస్టమ్‌కు ఇష్టం లేదు
- ఈ వ్యవస్థ వెనుక ఆరుగురు కీలక వ్యక్తులు
- ఛాత్రోం కీ గూంజ్ ప్రచారంలో రాహుల్ కీలక వ్యాఖ్యలు

2లో

## దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

- 2047నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని లక్ష్యం
- 'స్వేచ్ఛా వాణిజ్యలతో యువతకు కొత్త అవకాశాలు
- రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోదీ
- 20వ రోజ్‌గార్ మేళాలో 51 వేలకు పైగా నియామక పత్రాల పంపిణీ
- దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో నిర్వహించిన ఉద్యోగ మేళా
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :** 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలనే లక్ష్యం దిశగా భారత్ అడుగులు వేస్తోందని, ఇందులో యువత పాత్ర చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ వివిధ దేశాలతో కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) దేశ

।మిగతా 2 లో।



## 22 ఏ సమస్యలకు త్వరలో ముగింపు

- 12 అంశాల్లో ఇప్పటికే రెండింటిపై జీవోలు
- 45 రోజుల్లో భూ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం
- ఆధార్ తరహాలో భూదార్ కార్డులు అందిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఇండ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ధ్రువపత్రాల అందజేత

2లో

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

- తనపై అనర్హత వేస్తూ మొన్న హైకోర్టు తీర్పు
- ఇచ్చిన తీర్పుపై దేశ సర్వోన్నత న్యాయస్థానంలో ఎస్‌ఎల్‌పీ
- మరోవైపు బీజేపీ కూడా కెవియట్ దాఖలు
- ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే పోరాడుతా
- ఎన్నికల్లో పోరాడటం నాకు కొత్త కాదు
- దానం నాగేందర్

2లో



## హైదరాబాద్‌లో వర్షం

- పలు ప్రాంతాలలో ట్రాఫిక్‌కు అంతరాయం
- ఖైరతాబాద్ పోటెత్తిన భక్తులు
- వర్షాన్ని కూడా లెక్కచేయని యువత
- ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ జామ్

5లో





# నాలా కబ్జా చేసి జన్వాడ ఫామ్‌హౌస్ నిర్మాణం

**తరువాయి భాగం**

తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం ఆ లీజ్ ఒప్పందంపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో పురపాలక శాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. సత్యం రామలింగరాజుకు చెందిన భూముల్లోనే ఈ ఫాంహౌస్‌ను అక్రమంగా నిర్మించారని ఆరోపించారు. కేటీఆర్ సతీమణి శైలిమ పేరుతో పాటు ఆయన అత్తగారి పేరు మీద ఇక్కడ భూములు ఉన్నాయని ఆరోపించారు. ఈ భూములన్నీ శతబిష ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పేరు మీద ఉన్నాయని, అసలు సూత్రధారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫామ్‌హౌస్ నిర్మాణం, నాలా ఆక్రమణలకు సంబంధించిన వివరాలపై ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో ఫోన్‌లో చర్చించారు. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి నిర్మాణాలు ఉన్నట్లు తేలినా వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలను, నిజాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలనే జన్వాడ ఫాంహౌస్ పరిశీలనకు వచ్చామన్నారు. ఈ ఫాంహౌస్‌ను నాలా ఆక్రమించి నిర్మించారని, అసలు ఇది ఎవరి పేరు మీద ఉందో స్పష్టత లేదన్నారు. కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి జన్వాడకు వెళ్లారు. అక్కడ ఉన్న భూముల రికార్డులు, యాజమాన్య వివరాలు, భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులను క్షేత్రస్థాయిలో పరిశీలించడమే తమ పర్యటన ఉద్దేశమని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేశారు. ఈ పర్యటన నేపథ్యంలో ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ఇది ప్రైవేట్ ఆస్తి అని, అనుమతి లేకుండా లోపలికి ప్రవేశించరాదంటూ ఫామ్‌హౌస్ వద్ద హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేసినట్లు సమాచారం.

# జన్వాడ ఫామ్ హౌస్ కేటీఆర్ సొత్తు కాదు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటన సందర్భంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇది కేటీఆర్ ఫాం హౌస్ అని, అన్ని నిజాలు బయట పెడతామంటూ ఉదయం 10:30 గంటలకు ప్రజాభవన్ నుంచి కాంగ్రెస్ నేతల బృందం జన్వాడ ఫామ్ హౌస్‌కు బయలుదేరింది. ఈ ఫామ్‌హౌస్ భూముల రికార్డులు, యాజమాన్య వివరాలు, ప్రభుత్వ భూములతో ఉన్న సంబంధాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనుండటంతో చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ ఆధ్వర్యంలో పోలీసులు భారీగా మోహరించారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో సిద్దిపేట జిల్లాలోని ఎర్రవల్లి ఫామ్ హౌస్ ఆస్తులు, భూముల వివరాలపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ఆపై వెలికట్టలో హరీశ్ రావు బంధువుకు చెందిన అసైన్డ్ భూములను కాంగ్రెస్ నేతలు పరిశీలించారు. ఈ క్రమంలో ఇప్పుడు జన్వాడకు వెళ్తుండటంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. పేదవాళ్లం అని చెప్పే కేటీఆర్‌కు ఈ విలువైన ఆస్తులు, ఫాం హౌస్ ఎలా వచ్చాయని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు, కేటీఆర్ టీం సైతం జన్వాడ ఫామ్ హౌస్ వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకునే అవకాశం ఉందని భారీగా పోలీసులను మోహరించారు.



తెలంగాణ రాజకీయాల్లో గత కొన్ని రోజులుగా హాట్ టాపిక్‌గా ఉన్న వాటిలో కేసీఆర్ ఎర్రవల్లి ఫాం హౌస్‌తో పాటు జన్వాడ ఫామ్‌హౌస్ ఒకటి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ఈ ఫాం హౌస్‌పై ఆరోపణలు చేయడం, కాంగ్రెస్ నాయకులు ఫామ్‌హౌస్‌ను సందర్శిస్తారన్న ప్రచారాలు జోరందుకున్నాయి. ఉదయం నుంచి అక్కడ హడావుడి కనిపిస్తోంది. దాంతో ఆ స్థలానికి అసలైన యజమానిని నేనేనంటూ ప్రదీప్‌రెడ్డి స్పందించారు. ఈ మేరకు ఫామ్‌హౌస్ వద్ద మాట్లాడుతూ.. అసలు యజమానిని తానేనని, అది కేటీఆర్ ఆస్తి కాదని క్లారిటీ ఇచ్చారు. జన్వాడలో ఉన్న 4 ఎకరాల భూమి పూర్తిగా తన స్వార్జితమని, 2019లో అన్ని చట్టబద్ధమైన ప్రక్రియలను పూర్తి చేసి కొనుగోలు చేశానని తెలిపారు. ఈ ప్రాపర్టీకి సంబంధించిన నూటికి నూరు శాతం చట్టబద్ధమైన టైటిల్ పత్రాలు తన వద్ద ఉన్నాయని, కేటీఆర్‌కు తాను కేవలం లీజుకు మాత్రమే ఇచ్చానని ప్రదీప్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనకు చిన్ననాటి స్నేహితుడని, అందుకు ఆయనకు చట్టప్రకారమే లీజుకు ఇచ్చినట్లు వెల్లడించారు. ఇందులో ఎలాంటి అక్రమాలకు పాల్పడటం లేదా నిబంధనల ఉల్లంఘనలు జరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వానికి లేదా రెవెన్యూ అధికారులకు ఈ స్థలంపై ఎలాంటి అనుమానాలున్నా నేరుగా నోటీసులు ఇవ్వాలన్నారు. ఆ నోటీసులకు స్పందించి జన్వాడ ఫామ్ హౌస్ గురించి వివరణ ఇస్తానని, ప్రభుత్వానికి, చట్టపరమైన విచారణకు తాను సహకరిస్తానని ప్రదీప్‌రెడ్డి ప్రకటించారు. అయితే వ్యక్తిగత ఆస్తులను రాజకీయ విమర్శలకు వేదికగా మార్చడం, ముట్టడులకు ప్రయత్నించడం సరికాదని హితవు పలికారు. అనుమతి లేకుండా ఎవరైనా తన ఆస్తిలోకి ప్రవేశిస్తే చట్టప్రకారం పోలీసు రక్షణ కోరతానని హెచ్చరించారు. అసెంబ్లీ కేంద్రంగా మొదలైన ఈ సవాళ్లు, ఆరోపణలతో ప్రదీప్ రెడ్డి స్పందించి తన ఫాం హౌస్‌పై రాజకీయాలు చేయవద్దని కోరారు. నోటీసులు ఇస్తే, పూర్తి వివరాలు, డాక్యుమెంట్స్ బహిర్గతం చేసి వివరాలు వెల్లడించడానికి తనకు ఏ అభ్యంతరం లేదన్నారు.

# జన్వాడ ఫాంహౌస్‌పై కేటీఆర్ రియాక్షన్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**



జన్వాడ ఫాంహౌస్ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని అన్నారు. తాము ఏదైనా తప్పు చేసినట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకున్నా సిద్ధమని స్పష్టం చేశారు. అధికారం మీ చేతుల్లోనే ఉందని, అక్రమాలు జరిగితే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. వనపర్తి జిల్లాలో పర్యటించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. గుమ్మడం, పెబ్బేరు సబ్‌స్టేషన్లను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాష్ట్రంలో ఎక్కడా 12 గంటల విద్యుత్ సరఫరా కూడా జరగడం లేదని ఆరోపించారు. జూరాలలో నీళ్లు ఉన్నప్పటికీ పాలమూరు రైతుల ప్రయోజనాలను దెబ్బతీస్తూ దిగువకు నీటిని విడుదల చేశారని విమర్శించారు. పోతిరెడ్డిపాడు నుంచి నీటిని విడుదల చేశారని కేటీఆర్ అన్నారు. రాజకీయ వార్తలు చదవండి



# సుప్రీంకోర్టును ఆశ్రయించిన దానం నాగేందర్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**

దానం నాగేందర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పుపై స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు అనుమతిస్తుందా లేదా అనేది వేచిచూడాల్సి ఉంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఎప్పుడు విచారణకు స్వీకరిస్తుందనే విషయంపైనా స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ దానం నాగేందర్ దాఖలు చేసిన ఎస్ఎల్‌పీని దేశ సర్వోన్నత న్యాయస్థానం విచారణకు స్వీకరించి అప్పీలు దాఖలుకు అనుమతిస్తే, హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ అప్పీలు చేసే అవకాశం ఉంటుంది. దానం నాగేందర్‌పై హైకోర్టు శుక్రవారం అనర్హత వేటు వేసింది. బీఆర్ఎస్‌లో గెలిచిన దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేశారంటూ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ శాసన సభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ నిర్వహించిన సీజే ధర్మాసనం, దానంపై అనర్హత వేటు వేస్తూ తీర్పు వెలువరించింది. స్పీకర్, ఎన్నికల కమిషన్‌కు ఈ తీర్పు కాపీలు అందించాలంటూ రిజిస్ట్రీని ఆదేశించింది. అయితే పాడి కౌశిక్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ వ్యాజ్యం దాఖలు చేస్తే తన వాదనలు కూడా వినాలని కౌశిక్ రెడ్డి పిటిషన్‌లో పేర్కొన్నారు.

హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని ఆయన వివరించారు. ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే పోరాడతామన్నారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని దానం వివరించారు. పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చినవాడినని తెలిపారు.

**అక్టోబర్‌లో విచారణ**

దానంపై అనర్హత వేటు వేయాలంటూ 2024 ఏప్రిల్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 3 నెలల్లో నిర్ణయాన్ని వెలువరించాలంటూ సర్వోన్నత న్యాయస్థానం 2025 జులై 31న స్పీకర్‌కు గడువు విధించడంతో ఈ మార్చి 11న స్పీకర్ తీర్పు వెలువరించారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న మిగిలిన ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణ అక్టోబర్‌లో జరగనుంది.

# దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

**తరువాయి భాగం**



యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని అన్నారు. కొత్త మార్కెట్లకు భారత వ్యాపారులు చేరుకోవడంతో పాటు, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి ప్రధాని ఈ మేరకు మాట్లాడారు. ఈ సందర్భంగా 51వేల మందికి నియామకపత్రాలు అందజేశారు.

భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని ప్రధాని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, కొత్త మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. అదే సమయంలో యువతకు కెరీర్‌లో కొత్త మార్గాలు తెరుచుకుంటున్నాయని పేర్కొన్నారు. భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై ప్రపంచ దేశాల్లో విశ్వాసం పెరుగుతోందని మోదీ అన్నారు. ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువత నుంచి ప్రపంచానికి భారీ అంచనాలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ సేవల్లో చేరుతున్న యువత ప్రతి నిర్ణయంలోనూ దేశాన్ని అభివృద్ధి, స్వావలంబన దిశగా తీసుకెళ్లే ఆలోచనను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. యువతకు ఇతర యువత పట్ల ప్రత్యేక బాధ్యత ఉందని చెప్పారు.

**బ్రిక్స్‌లోనూ యువత భాగస్వామ్యం**

ఇటీవల ముగిసిన బ్రిక్స్ సదస్సును ప్రధాని మోదీ ప్రస్తావించారు. బ్రిక్స్ సహకారం కేవలం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని అన్నారు. భారత పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా ఈ భాగస్వామ్యంలో చురుకైన భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికలపై భారత్ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో దేశ యువత తమ నైపుణ్యాలను మరింతగా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.

**'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ**

ప్రతి రంగంలోనూ శరవేగంగా మార్పులు జరుగుతున్నాయని ప్రధాని మోదీ అన్నారు. 'నిరంతరం నేర్చుకుంటూనే మీరు ఈ స్థాయికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి మళ్లీ కొత్త విషయాలు నేర్చుకునే సరికొత్త ప్రయాణం ప్రారంభమవుతుంది. మీరు ఎల్లప్పుడూ మీ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి. కొత్త సాంకేతికతను, కొత్త వ్యవస్థలను అర్థం చేసుకోవాలి. 'మిషన్ కర్మయోగి' ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో మీకు సాయపడుతుంది. ప్రభుత్వం అసలైన బలం పౌరులకు దానిపై ఉన్న నమ్మకమే. ఆ నమ్మకం ఎలా వస్తుందంటే.. పౌరులకు ప్రభుత్వంతో ఎలాంటి అనుభవం ఎదురైందనే దాన్ని వల్ల వస్తుంది. ప్రభుత్వ సేవలో మన తారకమంత్రం ఒక్కటే కావాలి. 'నాగరిక్ దేవో భవ'. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమే. మీ పనితీరు వల్ల ఏ పౌరుడి జీవితమైనా సులభతరమైతే, అప్పుడే మీ విజయం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంటుంది' అని ప్రధాన మోదీ పేర్కొన్నారు.

**51 వేల మందికి పైగా నియామక పత్రాలు**

20వ రోజ్‌గార్ మేళాలో భాగంగా 51 వేల మందికి పైగా కొత్తగా నియమితులైన యువతకు నియామక పత్రాలు అందించారు. దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తగా ఎంపికైన అభ్యర్థులు రెవెన్యూ విభాగం, రైల్వేలు, హోం వ్యవహారాలు, ఆరోగ్యంకుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు, రక్షణ తదితర కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో విధుల్లో చేరనున్నారు. ఈ 20వ రోజ్‌గార్ మేళాతో కలిపి ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

# 22 ఏ సమస్యలకు త్వరలో ముగింపు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**



రాష్ట్రంలో 22 ఏతో పాటు ఇతర భూ సమస్యలకు త్వరలో పరిష్కారం చూపి ప్రజలకు తీపికబురు అందిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి శాసన సభలో ప్రకటించిన 12 అంశాలపై దశలవారీగా చర్యలు చేపడుతున్నామని, ఇందులో కాలనీల సమస్యకు జీవో 118, సింగరేణి ప్రాంతంలోని ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణకు జీవో 76 జారీ చేసినట్టు వెల్లడించారు. మరో 45 రోజుల్లో భూ సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని చెప్పారు. హైదరాబాద్ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 44 కాలనీల్లో ఇండ్ల క్రమబద్ధీకరణకు సంబంధించిన ధ్రువపత్రాలను శనివారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ప్రజాప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల భూ సమస్యల పరిష్కారానికి ఆధార్ తరహాలో భూదార్ కార్డులు అందించనున్నట్టు చెప్పారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని 64 కాలనీలకు 44 కాలనీల సమస్యలను పరిష్కరించామని తెలిపారు. గత ప్రభుత్వం నుంచి నిషేధిత ఉత్తర్వులు ఉన్నప్పటికీ నెల రోజుల్లోగా సమస్యలను పరిష్కరించి ఇండ్లను క్రమబద్ధీకరిస్తామని, ఎవరూ ఇండ్లు కూల్చాల్సిన పరిస్థితి ఉండదని స్పష్టం చేశారు. జీవో 118 ద్వారా మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని మరికొంత మంది సమస్యలను కూడా నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా భూ సర్వే నిర్వహించి భూముల సరిహద్దులను డిజిటల్ మ్యాపింగ్ ద్వారా నమోదు చేసి ప్రతి భూమికీ భద్రత కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. 22ఏ సమస్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచే ఉందని, దానిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలోని లేఅవుట్లలోని కొన్ని ప్లాట్లు కూడా 22ఏ జాబితాలో చేరాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని ప్రకటించారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలోనూ ఇలాంటి సమస్యలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జీవో 118 జారీ చేయలేదని, పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం ప్రజల హక్కులను కాపాడేందుకు ఈ నిర్ణయం తీసుకుందని చెప్పారు. గతంలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ప్లాట్ యజమానికీ పూర్తి హక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలోని చిక్కులను తొలగించేందుకు 44 కాలనీల కోసం జీవో 118 తీసుకొచ్చామని తెలిపారు. త్వరలో భూ సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. కాలనీల్లో బస్సు సౌకర్యం అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైన చోట ఆర్టీసీ బస్సులు నడిపిస్తామని అన్నారు.

**సమావేశంలో తోపులాట**

స్టేడియంలో సభ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. కాంగ్రెస్ నాయకులు వేదికపైకి రావడంతో బీఆర్ఎస్ నాయకులను కూడా వేదికపైకి అనుమతించాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పట్టుబట్టినట్టు తెలిసింది. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురినీ శాంతింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ బుగ్గ రపు దయానంద్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, కాంగ్రెస్ మలక్‌పేట్ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ అక్బర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్మోహన్‌గౌడ్, దేప భాస్కర్‌రెడ్డి, ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ఉప్పల్ శ్రీనివాస్‌గుప్తా, ఈశ్వరమ్మ యాదవ్, కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# విద్యార్థులే దేశ భవిష్యత్తు

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :**

దేశమంతా ఓ సిస్టమ్ చేతిలో బందీగా ఉందని, విద్యార్థులు ప్రశ్నలు అడగడం కూడా ఆ వ్యవస్థకు ఏ మాత్రం ఇష్టం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. శనివారం రోజు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక) కార్యక్రమంలో ఆయన విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, విద్యా వ్యవస్థ, దేశంలోని సంస్థల పనితీరుపైనా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులే దేశ భవిష్యత్తు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థుల్లేకుండా ఏ దేశమూ గొప్పగా ఎదగలేదని ఆయన అన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడగడం, వ్యవస్థను ప్రశ్నించడం అనేది ప్రజాస్వామ్యానికి అవసరమని, కానీ ఇక్కడ విద్యార్థులు ప్రశ్నలు అడగటం వల్లే వ్యవస్థ వారిని భయపెడుతోందని రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు.

విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారని ముఖ్యంగా రాజకీయ నాయకుల కుటుంబ సభ్యుల ఎదుగుదల, దేశంలోని వ్యాపార రంగంలో కొందరి ఆధిపత్యం, న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి సంస్థల పనితీరుపైనా ప్రశ్నలు అడుగుతారని రాహుల్ గాంధీ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి, అంధభక్త్‌కు ఉన్న వ్యత్యాసం గురించి రాహుల్ స్పష్టంగా వివరించారు. 'విద్యార్థి నిరంతరం ప్రశ్నలు అడుగుతాడు. కొత్త విషయాల్ని తెలుసుకోవాలనే కుతూహలంతో ఉంటాడు. విద్యార్థి కాబట్టే అమిత్ షా కుమారుడు క్రికెట్ అసోసియేషన్ ఛైర్మన్‌గా ఎలా అయ్యాడు? ఇద్దరు వ్యక్తులు దేశంలోని వ్యాపారాలన్నింటినీ ఎలా కబ్జా చేశారు? న్యాయ వ్యవస్థ, ఎన్నికల సంఘం తమ బాధ్యతల్ని ఎందుకు సరిగా నిర్వహించడం లేదు.' అని ప్రశ్నిస్తున్నాడని రాహుల్ అన్నారు. 'అంధభక్తుడు ఎలాంటి ప్రశ్నలు అడగడు. మోదీని విష్ణువు అవతారంగా భావిస్తూ తనదైన ఊహా ప్రపంచంలో బతుకుతాడు. అంధ్‌భక్త్ పిరికివాడు. మన పాఠశాలలు, కాలేజీల పరిస్థితి ఎందుకు దిగజారింది? మౌలిక సదుపాయాలు ఎందుకు దెబ్బతిన్నాయి? ప్రశ్నాపత్రాలు ఎందుకు లీక్ అవుతున్నాయో అంధ్‌భక్త్ ఎప్పటికీ ప్రశ్నించడు.' అని రాహుల్ అన్నారు. అందుకే ప్రశ్నలు అడిగే విద్యార్థుల్ని కాకుండా, అసలేం ప్రశ్నలు వేయకుండా నమ్మే వ్యక్తుల్ని వ్యవస్థ కోరుకుంటోందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థులు సంతోషంగా లేరని, అసౌకర్యంగా, ఒత్తిడిలో ఉన్నారని, వారి భవిష్యత్తుపై వారికి స్పష్టమైన నమ్మకం కూడా కనిపించట్లేదని అన్నారు.

ఇదే సమయంలో దేశంలోని ప్రస్తుత వ్యవస్థపై తీవ్ర విమర్శలు చేస్తూ ఈ వ్యవస్థ వెనుక ఆరుగురు కీలక వ్యక్తులు ఉన్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు రాహుల్ గాంధీ. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌తో పాటు పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీల పేర్లను ప్రస్తావిస్తూ వీరే వ్యవస్థను నడిపిస్తున్నారని ఆరోపించారు. అజిత్ డోభాల్ సోషల్ మీడియా సహా అనేక వ్యవస్థల్ని నియంత్రిస్తున్నారని, ఫోన్ ట్యాపింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలపై నిఘా పెట్టి సమాచారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా కు చేరవేస్తారని ఆరోపించారు. ఇంకా వివిధ సంస్థల్లో తమకు అనుకూల వ్యక్తులనే వ్యవస్థ నియమించుకుందని మండిపడ్డారు. మోహన్ భాగవత్ సిద్ధాంతపరమైన అంశాల్ని పర్యవేక్షిస్తారని, ఇంకా అంబానీ, అదానీ వ్యవస్థకు ఇరువైపులా ఆర్థిక శక్తులుగా ఉన్నారని అన్నారు. తన ప్రసంగంలో ఇంకా ఇతర సమస్యలపై మాట్లాడారు. దేశవ్యాప్తంగా 10 లక్షల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఇంకా సుమారు లక్ష పాఠశాలలు మూతపడ్డాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. మూతపడ్డ పాఠశాలల్లో 55 శాతం ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. విద్యా రంగంలో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయుల కొరత వంటి అంశాలపై విద్యార్థులు ప్రశ్నించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఛాత్రోం కీ గూంజ్ ప్రచారం ద్వారా కాంగ్రెస్ విద్యార్థులు, యువత సమస్యల్ని తెలుసుకుంటోంది. ముఖ్యంగా పలు పరీక్షల్లో జరుగుతున్న అక్రమాలు, పేపర్ లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న ఫీజులు, ఉద్యోగ నియామకాల్లో సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై పోరాడుతోంది. ఇప్పటికే కొద్ది నెలలుగా రాహుల్ గాంధీ దేశంలోని పలు నగరాల్లో (కోటా, దేహ్రాదూన్, ప్రయాగ్‌రాజ్, పుణె) ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు.





# హయత్‌నగర్ ఎంఈఓ ఆఫీస్ ముందు సీఐటీయూ ధర్నా

**ఎల్ బినగర్,తెలంగాణ చౌరస్తా:**

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అక్షయ పాత్ర ట్రస్టు నుండి విరమించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ మేరకు ఎంఈఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ..గత 23 ఏళ్లుగా మధ్యాహ్న భోజనాన్ని వండి వార్చుతున్న కార్మికుల పొట్టకొట్టి, కమిషన్ల కోసం స్వచ్ఛంద సంస్థలకు కట్టబెట్టడం సరికాదన్నారు.అబ్దుల్లాపూర్ మెట్, హయత్‌నగర్ మండలాల్లో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన టిఫిన్లకు సంబంధించిన 5 నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.అప్పులు చేసి పిల్లలకు వండి పెడుతున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా అన్యాయంగా రోడ్డున పడేస్తే చూస్తూ ఊరుకోమని..అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మండల సత్యనారాయణ,గుండె శివకుమార్,వర్కాల బాలరాజ్,లక్ష్మమ్మ, నవనీత,నాగరాణి, మంగమ్మ,స్వరూప, మనమ్మ తదితరులు పాల్గొన్నారు.





# ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయండి

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య
- చిల్పకుంట్ల గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య
- చిల్పకుంట్లలో విస్తృత ప్రచారం.. పోస్టర్ ఆవిష్కరణ

**నూతనకల్, తెలంగాణ చౌరస్తా:**

ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ చిల్పకుంట్ల గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేసి, అనంతరం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో వ్యవసాయ రంగంపై ఆధారపడి సుమారు 60 శాతం మంది ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ రంగాన్ని క్రమంగా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆరోపించారు. రైతులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను కాపాడుకోవడంతో పాటు వ్యవసాయ రంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత రైతాంగంపై ఉందన్నారు.ఈ నేపథ్యంలోనే రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై చర్చించేందుకు ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభల సందర్భంగా ఈ నెల 28న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ బహిరంగ సభకు రైతులు, వ్యవసాయ కూలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి దగ్గుల మల్లయ్య, భూపాల్‌రెడ్డి, కూసు ఉప్పలయ్య, మున్నా అశోక్, జయసుధ, సుజాత, సైదులు తదితరులు పాల్గొన్నారు.



# గౌతమ్‌పూర్‌లో సార్ ‘సమగ్ర ఓటర్ల జాబితా సవరణ’

- తప్పుడు సమాచారమిస్తే జైలు శిక్ష
- చుంచుపల్లి తహసీల్దార్ నాగరాజు హెచ్చరిక

**చుంచుపల్లి,భద్రాద్రి బ్యూరో తెలంగాణ చౌరస్తా :**



చుంచుపల్లి మండలం గౌతమ్‌పూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి మండల రెవెన్యూ అధికారి (తహసీల్దార్) నాగరాజు, బూత్ స్థాయి అధికారులు ఆర్ ఐ రాములు,బిఎల్ఓ లు పద్మ, రాజేశ్వరి, మస్తాన్, శివలీలా పాల్గొని గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

***ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ..***

ఓటర్ల జాబితా నమోదు, మార్పులు, చేర్పుల ప్రక్రియలలో ప్రజలందరూ సరైన వివరాలు మాత్రమే అందించాలని కోరారు. విధుల్లో ఉన్న అధికారులకు అసత్య వివరాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.భారతీయ నాగరిక సురక్ష సంహిత సెక్షన్ 217 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు లేదా అధికారులకు తప్పుడు సమాచారం అందించడం క్రిమినల్ నేరమని, దీనికి జైలు శిక్ష విధించబడుతుందని స్పష్టం చేశారు.ప్రజా ప్రాతినిధ్య చట్టం1950 (సెక్షన్ 31) ప్రకారం ఓటర్ల జాబితా తయారీ, సవరణ, సరిదిద్దడం, పేరు చేర్చడం లేదా తొలగించడాలకు సంబంధించి ఎలాంటి అసత్య ప్రకటనలు చేసినా జైలు శిక్ష లేదా జరిమానా, లేదా రెండూ విధించబడతాయని హెచ్చరించారు.జతపరచాల్సిన ధ్రువీకరణ పత్రాల జాబితాదరఖాస్తుదారులు తమ స్వయం ధృవీకరణ (సెల్ఫ్ అటెస్టెడ్) ప్రతులతో పాటు, అవసరమైన చోట తల్లిదండ్రుల ధృవీకరణ పత్రాల నకళ్లను జత చేయాల్సి ఉంటుందని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగి గుర్తింపు కార్డు లేదా పింఛను ఉత్తర్వు.జూలై 1, 1987 కంటే ముందు ప్రభుత్వం, స్థానిక సంస్థలు, బ్యాంకులు, తపాశా కార్యాలయం, భారతీయ జీవిత బీమా సంస్థలు జారీ చేసిన గుర్తింపు పత్రాలు.సమర్థ అధికారిచే జారీ చేయబడిన జనన ధ్రువీకరణ పత్రం.
పాస్‌పోర్ట్.గుర్తింపు పొందిన బోర్డులు లేదా విశ్వవిద్యాలయాలు జారీ చేసిన పదవ తరగతి/విద్యార్హత ధ్రువీకరణ పత్రం.సంబంధిత ప్రభుత్వ అధికారి జారీ చేసిన శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రం.అటవీ హక్కుల ధ్రువీకరణ పత్రం.అధికార యంత్రాంగం జారీ చేసిన బీసీ/ఎస్సీ/ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రాలు.జాతీయ పౌర పట్టిక నమోదు ప్రతులు (అందుబాటులో ఉన్న చోట).స్థానిక అధికారులు తయారు చేసిన కుటుంబ రిజిస్టర్ (కుటుంబ నమోదు పుస్తకం).ప్రభుత్వం కేటాయించిన భూమి లేదా ఇంటి కేటాయింపు పత్రం.ఆధార్ సమర్పణకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ప్రత్యేక ఆదేశాలు/మార్గదర్శకాలు వర్తిస్తాయి.ఈ కార్యక్రమంలో స్థానిక బూత్ స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శి, విఆర్వో, గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



# లిటిల్ మాస్టర్స్ స్కూల్‌లో ఘనంగా వినాయక నిమజ్జనం

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల పరిధిలోని రొంపికుంట గ్రామంలో గల లిటిల్ మాస్టర్స్ స్కూల్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఆరో రోజు భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల నడుమ ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జంగిలి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేకంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, భక్తి గీతాల నడుమ వినాయక విగ్రహాన్ని శోభాయాత్రగా తీసుకెళ్లి ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇనామ్‌గూడ గ్రామ పంచాయతీకి జిల్లా అధికారుల షోకాజ్ నోటీసులు

- విధుల నిర్వహణ పట్ల సర్పంచ్ తో పాటు కార్యదర్శికి నోటీసులు
- వివరణతో పాటు రికార్డులు సమర్పించాలంటూ ఆదేశాలు
- వివరణ ఆధారంగానే తదుపరి చర్యలు

**అబ్దుల్లాపూర్‌మెట్ తెలంగాణ చౌరస్తా:**

ఇనామ్‌గూడ గ్రామ పంచాయతీపై జిల్లా పంచాయతీ అధికారుల పై తమ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై సర్పంచ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం-2018 నిబంధనల ప్రకారం తమకు అప్పగించిన చట్టబద్ధ విధులు, బాధ్యతల నిర్వహణలో ప్రాథమికంగా పనిపట్ల విస్మరణ జరిగినట్లు గుర్తించడంతోనే ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నోటీసులకు సంబంధించి పూర్తి వివరాలతో కూడిన వివరణతో పాటు ఇప్పటివరకు నిర్వహించిన విధుల రికార్డులను సమర్పించాలని స్పష్టం చేశారు.

**వివరణ ఆధారంగానే తదుపరి చర్యలు:**

షోకాజ్ నోటీసులకు సర్పంచ్ ,గ్రామ కార్యదర్శి ఇచ్చే వివరణ, పంచాయతీ రికార్డుల పరిశీలన ఆధారంగానే తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్లు అధికారులు వెల్లడించారు.బాధ్యులపై విచారణ అనంతరం చట్టబద్ధమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.ప్రస్తుతం జారీ చేసిన నోటీసులు ప్రక్రియలో భాగమేనని,తుది నిర్ణయం ఇంకా తీసుకోలేదని స్పష్టం చేశారు. దీంతో అధికారులు ఇచ్చే తుది నివేదిక, తీసుకోబోయే చర్యలపై స్థానికుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



# అర్హులైన నిరుపేదలకే ఇందిరమ్మ గృహాలు ఇవ్వాలి

- కమాన్ పూర్ లో బిఆర్ఎస్ నాయకుల డిమాండ్
- ఇందిరమ్మ ఇండ్ల అక్రమాలపై విచారణ జరపాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం
- దళారుల హవా నడుస్తోందని, నిరసనలు చేపడతామని హెచ్చరిక

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో నిజమైన నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కమాన్‌పూర్ మండల బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి బిఆర్ఎస్ నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. మొదటి, రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అర్హులైన పేదలకు ఇళ్లు దక్కలేదని విమర్శించారు. గృహాల మంజూరులో కొందరు దళారులు చేతివాటం చూపిస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రామంలోని అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అలాగే తమ పార్టీ నేతలపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ శంకర్, మాజీ ప్రజాప్రతినిధులు గుర్రం లక్ష్మీమల్లు, కొండ వెంకటేష్, ఆకుల గట్టయ్య, కొట్టే భూమయ్య, పార్టీ నాయకులు రాచకొండ రవి, జాబు సతీష్, దండే కిషన్, కొయ్యడ రవి, రాచకొండ చంద్రమౌళి, పెండ్లి నారాయణ, ఎలబోయిన రామ్మూర్తి, నదిగట్టు సంపత్, ఆకుల రమేష్, చిప్పకుర్తి రాజ్ కుమార్, చిప్పకుర్తి శ్రీనివాస్, బోయిని బాలకృష్ణ, పంతకాని రవి, సుధాకర్, మానక ఊదెలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల ప్రతిభను వెలికి తీస్తున్న వినాయక ఉత్సవాలు

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**



కొత్తపేట ప్రాంతంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అనేక వేదికల వద్ద సాంస్కృతిక ప్రదర్శనలు కొనసాగుతున్నాయి.పిల్లలు , పెద్దలు వీటిలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అనేక వినాయక మండపాల వద్ద చిన్నారులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు.వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వినాయక ఉత్సవాలు ఉపయోగపడుతున్నాయి. స్థానిక కమర్షియల్ టాక్స్ కాలనీ ఆదిత్య రెసిడెన్సీలో శనివారం జరిగిన వేడుకలో ఆరేళ్ల చిన్నారి ధ్యాన హనుమాన్ చాలీసా పఠించి అందరిని ఆశ్చర్య చకితులను చేసింది. చిన్న వయసులో ఆ పాప చూపిన ప్రతిభ ప్రతిభ పలువురిని ఆకట్టుకుంది.




# జాబ్ మేళాతో ఉద్యోగ అవకాశాలు

- తహసీల్దార్ లాల్ బహదూర్

**రామన్నపేట తెలంగాణ చౌరస్తా :**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకై కోదాడలో జరిగే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంఆర్వో లాల్ బహదూర్ సూచించారు పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి,కోదాడ శాసనసభ్యులు ఉత్తమ్ పద్మావతి ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కోదాడకు తరలిరావాలని యువతీ యువకులను కోరారు.నకిరేకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశాల మేరకు రామన్నపేట మండల కేంద్రంలో జాబ్ మేళా కు ఏర్పాటూ చేసిన బస్సును తహసీల్దార్ లాల్ బహదూర్ ప్రారంభించి మాట్లాడుతూ జాబ్ మేళా నిరుద్యోగ యువకులకు గొప్ప అవకాశంఅని ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించి కుటుంబానికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ కోట ఉమారాణి ,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్,మొహమ్మద్ నాసర్,జెల్లా వెంకటేశం,గురికే శేఖర్,కేశవ దాస్, వెంకటేశం,మొహమ్మద్ మన్సూర్ జి పి ఓ,కొమ్ము నరసింహ తదితరులు పాల్గొన్నారు





# ఇందిరమ్మ గృహాలు మంజూరు

- పత్రాలను అందజేసిన కాంగ్రెస్ నాయకులు
- ఎస్.ఎస్. అన్వర్, గాండ్ల మోహన్
- మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు పత్రాల అందజేత
- పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఇల్లు ఇవ్వలేదు కాంగ్రెస్ నాయకులు

**కమాన్ పూర్ తెలంగాణ చౌరస్తా:**

కమాన్‌పూర్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను శనివారం అందజేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ఎస్. అన్వర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గాండ్ల మోహన్, కమాన్‌పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ కలిసి లబ్ధిదారులకు ఈ పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో పేదలకు గృహాలు ఇస్తామని మభ్యపెట్టి దగా చేసిందని మండిపడ్డారు. ఒక్కరికి కూడా ఇల్లు మంజూరు చేయని బిఆర్ఎస్ నాయకులు, ఈ రోజు ఇందిరమ్మ గృహాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహనతో మాట్లాడాలని, ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తే ఉపేక్షించబోరని, ఇప్పటికే బిఆర్ఎస్ నాయకులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేదవానికి తప్పకుండా ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడప కృష్ణమూర్తి, మల్యాల తిరుపతి, ముస్తాక్ అహ్మద్, పెన్ రెడ్డి కిషన్ రెడ్డి, చాట్ల రాయమల్లు, రాజయ్య, బొంపల్లి రాజయ్య, దాసరి రాజేష్, చింతపండు మధు, నగునూరి నరసయ్య, పిట్టల పద్మ, యూసుఫ్, లల్లు, మల్యాల మహేష్, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామాగా నందా తండా

- ఇచ్చిన మాట నిలబెట్టుకుంటా.. సర్పంచ్ మాలోత్ బలరాం నాయక్
- నందా తండా గ్రామపంచాయతీలో 'క్లీన్ అండ్ గ్రీన్', '100 రోజుల ఉపాధి హామీ' కార్యక్రమాలు ప్రారంభం.
- జన సంక్షేమమే పరమావధిగా రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్ల నిర్మాణం.
- ప్రజాపాలనతో గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్న సర్పంచ్ మాలోత్ బలరాం నాయక్.



**చుంచుపల్లి, భద్రాద్రి బ్యూరో, తెలంగాణ చౌరస్తా :**
గ్రామాన్ని పచ్చదనంతో, పరిశుభ్రతతో నింపి ఆరోగ్యకరమైన, ఆదర్శవంతమైన నందా తండాగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని చుంచుపల్లి మండలం, నందా తండా గ్రామపంచాయతీ సర్పంచ్ మాలోత్ బలరాం నాయక్ ఘంటాపథంగా చెప్పారు. శుక్రవారం నందా తండా గ్రామపంచాయతీ పరిధిలో 'క్లీన్ అండ్ గ్రీన్' '100 రోజుల ఉపాధి హామీ' కార్యక్రమాలను ఆయన సమక్షంలో అత్యంత కోలాహలంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాలోత్ బలరాం నాయక్ మాట్లాడుతూ..."నన్ను నమ్మి అత్యధిక మెజారిటీతో గెలిపించిన నందా తండా ప్రజల రుణం తీర్చుకుంటాను. ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటూ,ప్రజాపాలన ధ్యేయంగా సేవలందిస్తాను. ఎన్నికల సమయంలో నేను ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తా. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు పక్కా రోడ్లు, ప్రతీ వీధిలో వెలుగులు నింపేలా వీధి లైట్ల ఏర్పాటు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తాం.

**" ఉపాధి హామీకి సంపూర్ణ మద్దతు:**
గ్రామస్తుల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడే 100 రోజుల ఉపాధి హామీ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ తరఫున సంపూర్ణ సహకారం, మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు సర్పంచ్ స్పష్టం చేశారు. "శుభ్రతే మన బాధ్యత పచ్చదనమే మన భవిష్యత్తు" అనే సందేశంతో గ్రామాన్ని సుందరీకరించేందుకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామ ప్రగతికి జై కొట్టాలని సర్పంచ్ మాలోత్ బలరాం నాయక్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పెద్ద ఎత్తున గ్రామస్తులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సేవలు అభినందనీయం

- గ్రామ సర్పంచ్ కందికంటి విజయకుమార్
- బండరావిరాల గ్రామంలో ఘనంగా గురువుల సన్మానం



**అబ్దుల్లాపూర్‌మెట్,తెలంగాణ చౌరస్తా:**
అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామంలో సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది.సమాజ నిర్మాణంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయుల సేవలను గుర్తిస్తూ వారిని శాలువాలు,జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి, పాఠశాల పురోగతికి విశేష సేవలు అందిస్తున్న బిఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బుడిద రామిరెడ్డి సేవలను సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్,గ్రామ పాలకవర్గం, ఉపాధ్యాయులు,గ్రామ ప్రజలు ప్రత్యేకంగా కొనియాడారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఫౌండేషన్ తరఫున అందిస్తున్న ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్న జగత్ స్వప్న డెవలపర్స్ వంశీ,ఉదయ ఇండస్ట్రీస్ రంగారావు,బిఎన్ఆర్ ఇండస్ట్రీస్ బూడిద నందా రెడ్డి,తెలంగాణ డెవలపర్స్ నరసింహ యాదవ్, సప్తగిరి ఇండస్ట్రీస్ జగన్, గ్రామ యువజన నాయకులు గుండ్ల సతీష్ యాదవ్, తెలంగాణ డెవలపర్స్ బిక్షపతి యాదవ్‌లకు నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల పెయింటింగ్, అద్భుతమైన కాన్సెప్ట్‌ను రూపొందించిన గోవింద్ నందిగామ సృజనాత్మక కృషిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అబ్దుల్లాపూర్‌మెట్ ఎంఆర్ఓ సుదర్శన్ రెడ్డి, ఆర్ఐ రాంబాబు,సిఐ అశోక్ రెడ్డి,ఎంఇఓ జగదీశ్వర్,ఎస్ఐ ప్రియాంక రెడ్డి,జిపిఓ రాకేష్,ఉప సర్పంచ్ దూస శంకర్,పంచాయతీ కార్యదర్శి ఈర్లపల్లి శ్రీనివాస్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగు నరసయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు. వార్డు సభ్యులు కన్నె భరత్ యాదవ్,ఏర్పుల హరి కృష్ణ,కందికంటి అనూష ప్రవీణ్,గుండ్ల భవాని శివ ముదిరాజ్, యువజన నాయకులు ఒంగూరి రమేష్, కొండ రాజేష్ యాదవ్, కొత్త శ్రీకాంత్ గౌడ్,ఏముల శివశంకర్, నెమురగోముల కరుణ్, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# పందిల్ల గ్రామంలో ఆరోగ్య పరీక్షలు

**కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**
కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని పందిల్ల గ్రామంలో గల గ్రామపంచాయతీ ఆవరణలో ఆరోగ్య అధికారులు ఆధ్వర్యంలో ఎక్స్ రే తో ఆరోగ్య పరీక్షల నిర్వహించారు.గ్రామ ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరీక్షలు నిర్వహించి,ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య,ఉప సర్పంచ్ దర్మల రవి,మాజీ ఎంపీటీసీ రావి సదానందం గ్రామపంచాయతీ కార్యదర్శి మహేందర్ ,హెచ్ వి సూపర్వైజర్ నీరజ, డి ఈ ఓ ప్రకాష్, ఎంపీహెచ్ఏ సరిత,వార్డు సభ్యులు ఇల్లందుల శంకర్ గౌడ్,కొత్తగట్టు కళ్యాణి మధు ఆశా వర్కర్లు ఇల్లందుల వాసవి, వరలక్ష్మి, ఎక్స్ రే టెక్నీషియన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



# హామర ప్రసాద్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

**`కాల్వ శ్రీరాంపూర్, తెలంగాణ చౌరస్తా:**
భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కల్పిత పుస్తక రచనకు ప్రయత్నించారనే ఆరోపణల నేపథ్యంలో హామర ప్రసాద్‌పై తెలంగాణ పోలీసు శాఖ చర్యలు తీసుకోవడాన్ని అంబేద్కర్ సంఘాల నాయకులు స్వాగతించారు.మహనీయులపై అనుచిత వ్యాఖ్యలు,దూషణలు చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు గజమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ అందించిన భారత రాజ్యాంగం, దాని ద్వారా దేశ ప్రజలకు లభించిన హక్కులు,సామాజిక న్యాయ ఫలాలను మరోసారి గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ....అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అమర ప్రసాద్‌పై పోలీసులు తీసుకున్న చర్యలు అభినందనీయమన్నారు.అయితే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహనీయులపై అసత్య, అవమానకర వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హామర ప్రసాద్‌పై పరువునష్టం దావా వేయాలని తమ ప్రధాన డిమాండ్‌గా పేర్కొన్నారు.మహనీయుల గౌరవానికి భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**రాజ్యాంగ విలువలను కాపాడాలి...**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమానత్వం,స్వేచ్ఛ,సామాజిక న్యాయం వంటి హక్కులకు పునాది వేసిందని నాయకులు పేర్కొన్నారు.రాజ్యాంగ నిర్మాతను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు.రాజ్యాంగ విలువలు,మహనీయుల ఆశయాలను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాల రాజేశం, ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లేపల్లి విజయసాగర్,ఎమ్మార్పీఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు అంబాల రాజేందర్,మాజీ సర్పంచ్ సిరికొండ కొమురయ్య, ఆర్టీఐ చట్టం పెద్దపల్లి జిల్లా అధికార ప్రతినిధి ఉయ్యాల ఓదెలు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం కాల్వ శ్రీరాంపూర్ మండల అధ్యక్షులు ఉమామహేశ్వర్,ఆర్టీఐ చట్టం పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ కుంట శ్రీకాంత్,జల్లా కార్యదర్శి చిలుముల రామస్వామి ,ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ నిశాంత్,ఆర్టీఐ చట్టం జిల్లా కార్యదర్శి దుమ్మటి హరీష్,ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా ఉపాధ్యక్షులు జిలుకర రాకేష్,తిరుమల రాజేష్, తాండ్రాజు,తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

**కాసిపేట, తెలంగాణ చౌరస్తా :**
కాసిపేట మండలంలోని పల్లంగూడ గ్రామ పంచాయతీ పరిధి గోండుగూడలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొని మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు.ప్రశాంతంగా ఉన్న పల్లెలు,పట్టణాల ప్రజలను 22ఏ భూ చట్టం పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చే వరకు, 22ఏ జాబితా నుంచి భూములను తొలగించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామాల్లో తాగునీరు, విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని అన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు గొంది వెంకటరమణ, పల్లె చంద్రయ్య, కొండబత్తుల రాంచంధర్,మంజూల రెడ్డి,శరత్,మొటూరి వేణు,అడే బాదు,జాడి రాంచంధర్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ పంటల సర్వేకు రైతులు సహకరించాలి

- వ్యవసాయ విస్తరణ అధికారి కడారి ప్రశాంత్

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా:**
పెద్దపల్లి మండలంలోని మారేడుగొండ లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు.వ్యవసాయ శాఖ చేపట్టిన డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని,అలాగే సాగు భూములను సందర్శించి సర్వే పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం వాలంటీర్ మొబైల్ అప్లికేషన్ ద్వారా చేపడుతున్న జియో ట్యాగింగ్ విధానాన్నీసాగు వివరాల నమోదును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ప్రతి ఎకరాను పక్కాగా రికార్డు చేయాలని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు.

**మొబైల్‌కు సందేశం...72 గంటల్లో సవరణ గడువు**
రైతుల సమక్షంలో వాలంటీర్ నమోదు చేసిన పూర్తి పంట వివరాలు తక్షణమే సంబంధిత రైతు ఫోన్ నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా చేరతాయని ఏఈఓ వివరించారు.ఈ వివరాలను రైతులు క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని,ఒకవేళ సాగు విస్తీర్ణం,వేసిన పంట రకం లేదా సర్వే నంబర్‌లో ఏమైనా పొరపాట్లు ఉంటే వెంటనే గుర్తించాలని తెలిపారు.సందేశం వచ్చిన 72 గంటల వ్యవధి లోనే ఏఈఓ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన సవరణలు పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించారు. గడువు దాటితే రికార్డుల్లో మార్పులు చేయడం సాధ్యపడదని వివరించారు.వాలంటీర్లకు రైతులు సహకరించాలని కోరారు.



# పీఆర్టీయూ టీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

- పెద్దపల్లి మండల అధ్యక్షులుగా మెతుకు తిరుపతి
- ప్రధాన కార్యదర్శిగా లక్కర్సు రాములు

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**
పీఆర్టీయూ టీఎస్ పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా మెతుకు తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా లక్కర్సు రాములు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పెద్దపల్లిలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో పీఆర్టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ మేరకు పాలకుర్తి మండల అధ్యక్షులు దొమ్మాటి రాజేందర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షులుగా సి.హెచ్ లింగయ్య, ఉపాధ్యక్షులుగా ఓదయ్య, రాజు, మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా కవిత, ఉపాధ్యక్షురాలుగా మమత, పద్మజారాణి, కార్యదర్శులుగా శ్రీనివాస్, రఘునందన్, మహిళా కార్యదర్శురాలుగా గీతాపాలిన్, ప్రసన్నలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పీఆర్టీయూ కార్యవర్గానికి మండల ప్రధాన కార్యదర్శి లక్కర్సు రాములు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానం రద్దుచేసి, ఆరు డీఏల విడుదల, పీఆర్సీ అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం స్పందించి, నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా, అందరినీ సమన్వయం చేసుకుంటూ ఐక్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సిహెచ్ సదాశివ, నరేందర్, సభ్యులు శ్రీనివాస్, పనిందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు
- పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి

**పెద్దపల్లి,తెలంగాణ చౌరస్తా :**
గణేష్ నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని పెద్దపల్లి డీసీపీ బి. రాంరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని డీసెంట్ ఫంక్షన్ హాలులో వినాయక మండపాల నిర్వాహకులతో, ఉత్సవ కమిటీ సభ్యులతో, అన్ని శాఖల ప్రభుత్వ అధికారులతో ఏర్పాటుచేసిన సమన్వయ సమావేశానికి డీసీపీ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వినాయక నిమజ్జన శోభయాత్రలో ప్రజలు, భక్తులు, మండపాల నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని సూచించారు. ట్రాఫిక్ కు ఇబ్బంది కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పెద్దపల్లి తహసీల్దార్ రాజయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఏసీపీ జి.కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**మినీ ట్యాంక్ బండ్ ప్రాంతం పరిశీలన..**
పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్లను రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులతో కలిసి డీసీపీ బి. రాంరెడ్డి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లను చేపట్టాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ చర్యలు, ఇతరత్ర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను కోరారు. గణేష్ నిమజ్జనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, వాహనాల రాకపోకలు, అత్యవసర వాహనాలకు మార్గం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐలు ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, ఎస్ఐ లు ఉన్నారు.




# ఊకే శిరీష ఘటనపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి

- ప్రొఫెసర్ కోదండ రామ్ కు వినతి
- ఓయూ విద్యార్థి సంఘాలు, జర్నలిస్టులు న్యాయవాదులు

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్ :**
రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రైమ్ కేర్ హాస్పిటల్ లో నర్సుగా పనిచేస్తున్న 21 ఏళ్ల ఆదివాసి యువతి హాస్పిటల్ కి సంబంధించిన వసతి గృహంలో అత్యాచారం కు గురై హత్య చేయబడింది.
ఈ ఘటనపై ఓయూ విద్యార్థి సంఘాలు ప్రైమ్ కేర్ హాస్పిటల్, ఘటన స్థలాన్ని, విచారించిన అధికారులను కలిసి ఆధారాలను సేకరించడం జరిగింది. ఈ ఘటన పట్ల అనుమానాలు మరియు హాస్పటల్ యాజమాన్యం వసతిగృహానికి సరైన భద్రత సౌకర్యలు కల్పించకపోవడం మూలంగానే ఈ ఘటన జరిగిందని స్పష్టంగా కనిపిస్తుంది. కావున ఈ ఘటన పైన సిట్టింగ్ జడ్జి చేత న్యాయవిచారణ జరిపించి నిందితులను హాస్పిటల్ యజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని ఇవ్వాళ ఉదయం తార్నాక లోని వారి నివాసం వద్ద కలిసి వినతి పత్రం ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బట్ట వెంకటేశ్వర్లు,లెనిన్ (ఏఐఎస్ఎఫ్), మధుసూదన్, సింధుజ,రవిచంద్ర పాపారావు,దేవ్, కిరణ్ ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

# బిసి సాహిత్యంపై వెంటాడే కలాలు ప్రభావం




తమ జీవితాన్ని రాసుకోకుండా, ఎవరి మెప్పుకోసమో తమది కాని జీవితాలను అక్షరాల్లో అలంకరించే రచయితలు కొందరు ఉంటారు. వారి రచనల్లో ఎన్నో పాత్రలు మాట్లాడుతాయి, ఎన్నో జీవితాలు నడుస్తాయి, ఎన్నో భావాలు కనిపిస్తాయి కానీ రచయిత అసలైన అస్తిత్వం మాత్రం ఎక్కడా కనిపించదు. ఇతరుల అనుభవాలను అప్పుగా తెచ్చుకుని, ఇతరుల స్వరాలకు తన కలాన్ని తాకట్టు పెట్టి రాసిన ప్రతి వాక్యం బయటికి ఎంత అందంగా కనిపించినా, అందులో వారి అస్తిత్వపు వెచ్చదనం ఉండదు. ఒక దశలో తన గురించి రాయడం మరిచిపోయిన రచయిత, తాను ఎవరో చెప్పుకోవడానికి కూడా తన రచనల మధ్య వెతుక్కోవాల్సి వస్తుంది. ఇలాంటి రోజుల్లో బిసిల కోసం బిసిలు రాసుకున్న పుస్తకమే 'వెంటాడె కలాలు - వెనుకబడిన కులాలు'. ఆ పుస్తకం రాసిన కలాల వెనుక ఎన్నో ఏండ్లుగా అనుభవించిన హేళనల, తిట్ల బాధ ఉండవచ్చు. వివక్ష, చిన్నచూపుల గుండెకోత ఉండవచ్చు. వేల టన్నుల కన్నీటి బరువుండవచ్చు, తరతరాలుగా చేసిన వెట్టిచాకిరి గోస ఉండవచ్చు. సాటివారి నుండే వచ్చిన పరాయి మాటలో, ప్రశ్నలో, విమర్శలో.. కారణం ఏదైనా కావచ్చు కాని ఫలితం మాత్రం కసిగా ముందుకొచ్చింది. ఎంతగా అంటే గోలకొండ కవుల సంచికంత గొప్పగా. ఒక మాట ఒక వర్గం కలాలను కదిలించి, ఒక పుస్తకానికి జన్మనిచ్చింది అంటే కొన్నిసార్లు అనుకోని కారణాలే మంచి రచనలకు ఆరంభమవుతాయి. ఆ సమయంలో స్పందించి, సంకల్పించి, ఆ సంకలనాన్ని 2001 సంవత్సరంలో వెలువరించిన వ్యక్తి జూలూరు గౌరీశంకర్. నేటికి ఆ పుస్తకం వచ్చి రెండున్నర దశబ్ధాలు. ఈ ఇరవై అయిదు ఏండ్లలో బిసి సాహిత్యం ఏ స్థితి నుంచి ఏ దిశకు పయనించింది? ఆ సంకలనం రాకముందు బిసి అస్తిత్వం, అనుభవం, స్వరం సాహిత్యంలో ఎక్కడ నిలిచాయి? ఆ పుస్తకం తర్వాత ఆ స్వరానికి ఎలాంటి బలం, విస్తృతి, కొనసాగింపు లభించాయి? ఒక పుస్తకం ఒక సాహిత్య ప్రవాహానికి ఎలా మలుపు తిప్పగలిగింది, ఆ మలుపు ఎంతవరకు గమనాన్ని మార్చిందనేదే ఈ వ్యాసం ముఖ్యోద్దేశం.

**వెంటాడె కలాలు ముందు:**

ఆధునిక సాహిత్యంలో 'వెంటాడె కలాలు'కు ముందు బిసిల సాహిత్యంలో అరకొరగా నాలుగు పుస్తకాలు కనిపిస్తాయి. జి.రాములు 1945లో వెలువరించిన 'ఆత్మఘోష'లో పద్మశాలీల జీవితాలను, 1954లో వచ్చిన 'పెరడి చెట్టు' నవలలో గౌడుల బతుకులను గురించి రాసాడు. 1955 లో లోకమలహరి రాసిన పద్మశాలీల గురించి తెలిపే ఆనాటి మరో నవల 'సంఘము'. పోరంకి దక్షిణ మూర్తి 1964లో 'ముత్యాలపందిరి', మామిండ్ల రామగౌడు 1971లో 'గౌడజన ప్రబోధము', 'కవి గౌడప్ప శతకము' రచనలు గౌడజీవితాలకు అద్దం పట్టాయి. 1975 మాదిరెడ్డి సులోచన కుమ్మరుల జీవితాలను 'సుషుప్తి' నవలగా తీసుకువచ్చింది. 1985లో వనం నరసింహారావు 'జరీపూలు', 2005లో కాలువ మల్లయ్య 'గువ్వల చెన్నా', 2009లో దేవులపల్లి కృష్ణమూర్తి 'ఊరువాడబతుకు' పద్మశాలీల గురించి వచ్చిన నవలలు. 'రజక గీతాలు'(పద్య,గేయ,వచన కవితలు) దేవరపల్లి మస్తాన్ రావు సంపాదకులుగా 1993లో రజక విద్యాపరిషత్తు ప్రచురించింది. ఇందులో ఉన్న కవితలన్నీ రజకుల జీవితాలకు అద్దం పట్టాయి. 1994లో ననుమాస స్వామి 'మోహిని', 2001లో అట్టాడ అప్పల్నాయుడు 'ఉత్కల', 2005లో నేరెళ్ళ శ్రీనివాసగౌడ్ 'బతుకుతాడు', 2006లో కె. వెంకటేశ్వర్లు 'కల్లు మండువ' నవలలలో గౌడజీవితాలను చిత్రించారు. 1992లో రాసాని 'చీకటి రాజ్యం', 2005లో బండి నారాయణ స్వామి 'మీ రాజ్యం మీరేలండి' నవలలు కురుమల జీవితాలకు అద్దంపట్టాయి. నీలగిరి సాహితీ సంస్థ నుండి 'బహువచనం' దళిత బహుజన కవిత్వం ఉపశీర్షికతో 1996లో వచ్చింది. నీలి సాహితి సంస్థ నుండి 'మేమె' (1996), 'మొగి' (1998) అనేవి దళిత బహుజన కవిత్వ పేరిటా సంపుటాలుగా వచ్చాయి. ఈ రెండింటికి సంపాదకులు లేరు. 1998లో విరసం నుండి షరీఫ్, సజ్జా వెంకటేశ్వర్లు సంపాదకత్వంలో 'చేనేత బతుకు పాట' అనే కవితా సంకలనం వెలువడింది. ఈ క్రమాన్ని గమనిస్తే అప్పుడు బిసి జీవితాలు సాహిత్యంలోకి ప్రవేశించినప్పటికీ బిసి అస్తిత్వాన్ని కేంద్రంగా నిలబెట్టుకుని, తమ జీవితాలను తామే స్వరపచుకోవాలనే దిశ ఇంకా స్పష్టంగా రూపుదిద్దుకోలేదని తెలుస్తుంది.

**వెంటాడె కలాలు తర్వాత:**

వచన కవితా సంకలనాలు: 'వెంటాడె కలాలు' తర్వాత బిసి జీవితాలు, వృత్తులు, అస్తిత్వాలు కవిత్వంలో మరింత విస్తృతంగా వ్యక్తమయ్యాయి. 2001లో 'ఎడపాయలు', 2005లో 'చెమ్మస్', 2006లో 'కళాలుగళాలు' కొంతవరకు బిసిల జీవితాలను కవిత్వీకరించాయి. 2013లో యువసాహితి సమితి, మెదక్ నుంచి 'ఇరుసు' బిసి వృత్తులను చిత్రించింది. అదే ఏడాది విశ్వకర్మ కవుల కవిత్వంగా 'రుంజ' వెలువడింది. 2016లో చింతం ప్రవీణ్ సంపాదకత్వంలో 'సమూహం' బిసి యువగళాలను వినిపించింది. 2019లో వి. జయప్రకాశ్ సంపాదకత్వంలో 'బీసీ కవితా సంకలనం' విస్తృతమైన గ్రంథం వెలువడింది. 2024లో వనపట్ల సుబ్బయ్య, సంగిశెట్టి శ్రీనివాస్‌లు 'ధిక్కార' (మహాత్మా పూలే స్ఫూర్తి కవిత్వం) సంకలనం వచ్చింది.

**వచన కవితా సంపుటాలు:**

రచయితల వ్యక్తిగత సంపుటాల విషయానికి వస్తే, పున్న అంజయ్య 2004లో 'చేనేత', 2015లో 'చేనేత కవిత' ద్వారా చేనేత జీవితాలను కవిత్వంలోకి తెచ్చారు. 2007లో దాసోజు కృష్ణమాచారి 'వన్నె' (స్వర్ణకారుడి కవిత్వం)ను, 2018లో 'పుటం' (విశ్వకర్మ వృత్తి కవిత్వం)ను వెలువరించారు. ఆడెపు లక్ష్మణ్ 'రాత్', 'పైలీ.. దివస్ పైలీ' (2007), 'కామ్‌గార్' (2023) ప్రస్తావించదగినవి. 2016లో 'కుర్చి', 2026లో 'తేజ్' (బీసీవాద కవిత్వం) వనపట్ల సుబ్బయ్య వెలువరించిన విలువైన గ్రంథాలు. 2022లో దాసోజు లలిత 'దాతి', 2024లో అవుసుల భానుప్రకాశ్ 'కశ్పి' (శ్రమజీవుల చెమట కావ్యం) వెలువడ్డాయి. బెల్లియాదయ్య 'నేను గొర్రెల్ని కాస్తుంటాను'(2011), 1999లో మునాసు వెంకట్ 'ఎన, మెద', శీలం భద్రయ్య 'ముస్తాదు', అవనిశ్రీ 'ఆపతి' (2019)లలో తమ తమ అనుభవాలను ప్రతిబింబింప చేసారు. జ్వలితల 'సంగటి ముంత', తగుళ్ల గోపాల్ 'దండె కడియం', మోహన కృష్ణ 'పోగు బంధం', జబ్బు వెంకటేష్ 'వన్నెరుమాల్' (2025), ప్రసాదమూర్తి 'కలనేత' వచనకవిత్వంతో పాటు, దోరవేటి 'శ్రమదేవో భవ' పద్యకావ్యం, గోశిక్ నరహరి 'పద్మశాలి శతకం', పులి జమున 'నేత మొగ్గలు', మంగళగిరి శ్రీనివాస్ 'ఆరెకటిక మొగ్గలు'. నాంపల్లి సుజాత 'మట్టి నానీలు', చాపల మహేందర్ 'శ్రామిక నానీలు' వంటి రచనలు కూడా ఇదే వరుసలో గుర్తించాల్సినవి.

**దీర్ఘకవితలు:**

బిసి దీర్ఘ కవితలు వృత్తుల విధ్వంసాన్ని నమోదు చేస్తూనే, సామాజిక ఆధిపత్యాన్ని ధిక్కరించాయి. పత్తిపాక మోహన్ 'తెగినపోగు' బిసి బతుకుపోగులకు అక్షరాల రంగులద్దాయి. బాణాల శ్రీనివాస్ 'కుంపటి' బిసివాద రచయితలలో చైతన్యాన్ని రగిల్చింది. అన్నవరం దేవేందర్ 'బువ్వకుండ' అస్తిత్వ సాహిత్యంలో చక్రం తిప్పింది. వనపట్ల సుబ్బయ్య 'అసిపె' వెనుకబడిన వర్గాల కలాల కత్తులకు పదును పెట్టించింది. మునాస వెంకట్ 'జెన', జూకంటి జగన్నాథం 'ఆశలేని కులకశ్పి గోస' తండ హరీష్ గౌడ్ 'వంకతాడు' గన్నోజు ప్రసాద్ 'కొలిమి', జూలూరు గౌరీశంకర్ 'బహుజనగణమన' బిసిల యుద్ధగీతం అయింది. దాసోజు కృష్ణమాచారి 'డాకలి', ఉప్పరి తిరుమలేష్ 'మెట్న', వీరగోని పెంటయ్య 'మండువ' బిసి కవిత్వానికి కొంత దాహం తీర్చాయి. సుద్దాల అశోక్ తేజ 'శ్రమకావ్యం', 'శూద్రగంగ' దీర్ఘ కావ్యాలు పురాణాలను పునర్ వాఖ్యానం చేస్తూ బిసివాద గొంతులకు బలాన్నిచ్చింది.

**బిసిపాట:**

పాట బిసిల శ్రమ, వృత్తి, అస్తిత్వ అనుభవాలకు సామూహిక స్వరాన్ని అందించే ప్రక్రియ.

అణచివేయబడిన గొంతుతోనే తన కథను, శక్తిని, వాటను తెలియజేస్తూ బీసీ పాట ఒక సాంస్కృతిక ప్రతిఘటనగా నిలిచింది. వి.ఎల్లన్న 'సబ్బండ నాదం', మిత్ర 'కైతల కవాతు', బి.ఎస్.రాములు సంపాదకత్వంలో వచ్చిన 'బహుజన తత్వాలు - బీసీ,ఎస్సీల పాటలు' (2004), ప్రజానాట్య మండలి ముద్రించిన 'చేతివృత్తుల పాటలు', 'కుల వివక్ష పాటలు' (2002), స్ఫూర్తి పాటలు (2012), తీగోనాగో ఎన్నియలో(2016) చింతల యాదగిరి పాటలు వీటితో పాటు ప్రత్యేక పుస్తకాలుగా వెలువరించకపోయినప్పటికీ బిసి పాట రాసిన వారు ఎందరో.

**బిసికథ:**

బిసిల దైనందిన జీవితం, వృత్తి, సామాజిక సంబంధాలు, అస్తిత్వ సంఘర్షణలను అనుభవంలో నుంచి ఆవిష్కరిస్తూ, స్వీయ అస్తిత్వ ప్రకటనకు అసలైన ప్రక్రియ కథ. అట్లాంటి వాటిలో మంగలి జీవిత కథలను తీసుకొచ్చిన సంకలనం 'అడపం'(2016). పద్మశాలీల కథల సంకలనం 'పడుగుపేకలు' (2016). గొల్లకుర్మల కథలు రెండు సంకలనాలు, ఒక సంపుటి వచ్చాయి. 'వేపకాయంత నిజం' (2019). 'గొంగడి' (2024) ఇవి సంకలనాలు, 'కులకశ్పి' (2025) సంపుటి. గౌడుల జీవితాలను చిత్రించిన పుస్తకం 'మా బతుకులు' (2009). 'మల్లెసాల' (2021) శతాధిక చేతివృత్తి కథలను అందించింది. 'సబ్బండ వర్ణాల సారస్వతం' (2017) బిసిజీవితాలను స్వగతాలు గానం చేసింది. 'ఆర్తారావం' (2009). దర్జీల జీవితాలను కథలుగా మలచిన 'కుట్టు కథలు'(2022). మంగలుల జీవితాలను చెప్పిన 'మా వూరి మంగలి కతలు'. ఈ మధ్య కాలంలో వచ్చిన 'తెలంగాణ బిసి కథా సంపుటాలు' 'మోకు' గౌడుల బతుకు తాళ్లు, 'వాము' కుమ్మరుల బతుకు చక్రాలు, 'రేవు' రజకుల బతుకు మూటలు అనేవి బిసి వాదాన్ని బలంగా వినిపిస్తున్నాయి. 'మట్టి మనుషులు' వడ్డెరుల జీవిత గాథలను వినిపించాయి. వీటితో పాటు ఒకటి రెండు కథలు రాసిన కథా రచయితలు వందలలో కనిపిస్తారు.

**బిసినవలలు:**

కులవ్యవస్థ అంచుల్లో నలిగిన బతుకులను విస్తృతంగా కేంద్రంలోకి తీసుకురావడానికి బిసి నవల ప్రత్యామ్నాయ సామాజిక చరిత్రను నిర్మించింది. అటువంటి నవలలలో చాకలుల జీవితాలను చిత్రించినవి 'రేవు, ఉతికేసిన బతుకులు, మీ రాజ్యం మీరేలండి, రేవు తిరగబడితే'. మంగలి బ్రతుకులను అక్షరబద్ధం చేసిన నవలలు 'మోదుగుపూలు, సంకెళ్ళు తెగాయి'. పద్మశాలీల జీవితాలను చెప్పిన 'అగ్గి పెట్టెలో ఆరుగజాలు, చిలకంచు జరీకోక, జీవనయానం'. వడ్డెర బతుకు దెబ్బలను తెలిపిన నవల 'రాముడుండాడు రాజ్జిముండాది'. మొండివారి కష్టాలు వినిపించిన నవల 'బయటి గుడిసెలు'. గంగిరెద్దుల సంచార జీవితాలను తెలిపినవి 'సంచారి, వరస'. గౌడుల జీవితాలను గానం చేసిన నవలలు 'ప్రజాజ్యోతి పాపన్న, దుల్దుమ్మ, వరకవి భూమగౌడ్'. గొల్లకురుమ నవలలు 'శప్త భూమి, కపిరి, ఏకుదారం', సాంబయ్య చదువు, కొండపొలం, గుడ్డెళ్ల గుమ్మి మారెమ్మ'. ఇక ' రెక్కడినంతకాలం, పరంపర, విమానం వచ్చింది' పంచదాయిల నవలలు. ఉప్పరుల నవల 'మట్టిబతుకులు'. కుమ్మరి నవల 'శాలివాహన'. బెస్త నవల 'గలగల గోదారి'. జాలరులవి 'కడలి కల్లోలం, మున్నీటి గీతలు' మొదలైనవి.

**బిసివిమర్శ:**

బిసిల సాహిత్యాన్ని సప్రమాణాలతో కొలవడంతో పాటు, దాని వెనుక ఉన్న అస్తిత్వం, కులాధిపత్యం, శ్రమ, సామాజిక అనుభవాలను విశ్లేషించినదే బిసి సాహిత్య విమర్శ. ఈ కోణంలో చూసినప్పుడు కత్తి పద్మారావు 'బిసి సామాజిక చరిత్ర - సాహిత్యం'(1998) అనే విమర్శ గ్రంథం రాశారు. బిసి కవిత్వాన్ని అనుశీలించిన మరో గ్రంథం జూలూరు గౌరీశంకర్ 'కవిత్వంలో బి.సి. సూర్యోదయం'(2015). బిసిల మీద అన్ని ప్రక్రియలలో వచ్చిన సాహిత్యాన్ని పరిశీలించిన విమర్శ గ్రంథం అట్టెం దత్తయ్య 'తెలంగాణ బిసివాద సాహిత్యం'(2021). బిసి కవిత్వాని విశ్లేషించిన మరో గ్రంథం సంగిశెట్టి శ్రీనివాస్ 'పుంజము' బిసి కవిత్వ విశ్లేషణ (2025). బిసి కథలను విశ్లేషిస్తూ తీసుకువచ్చిన బి.ఎస్.రాములు గ్రంథం 'బీసీ కథలు ఒక విశ్లేషణ' (2011). బిసి నవలలను సమగ్రంగా విశ్లేషించిన కె.పి.అశోక్ కుమార్ విమర్శ గ్రంథం 'తెలుగు సాహిత్యంలో బీసీ నవల' (2025).

**బిసి పరిశోధన:**

'వెంటాడే కలాలు' రావడంతో బిసిల సాహిత్యంపై పరిశోధన చేయాలనే స్పృహ పెరిగింది అని చెప్పక తప్పదు. ఆ ఎరుక లోనుండి వచ్చిన పరిశోధనలు బిసి సాహిత్యాన్ని అధ్యయన వస్తువుగా స్వీకరించాయి. లంకా వేంకటేశ్వర్లు 'ఆధునిక సాహిత్యంలో వృత్తి చైతన్యం' అనే అంశంపై, ఎం. ఓబులేషు బిసి కథా సాహిత్యంలో కులవృత్తులు - సామాజిక విశ్లేషణ, తెలంగాణ బీసీ కథలు నన్నే నరేశ్, బర్ల మమేందర్ 'కురుమల సాహిత్యం చరిత్ర సంస్కృతి', 'తెలుగులో విశ్వకర్మ సంబంధింత సాహిత్యం - పరిశీలన' అంశంపై భైరోజు శ్యాంసుందర్, 'బిసి కథలు - జీవితం' పారెల్ల బాలాంజనేయులు, 'ఆధునిక తెలుగు సాహిత్యం - చాకలివారి జీవితం' దస్తగిరి, 'రాయలసీమ కథా సాహిత్యం - వృత్తి జీవిత చిత్రణ' శ్రీధర్ వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు సమర్పించారు.

**ముగింపు:**

'వెంటాడె కలాలు - వెనుకబడిన కులాలు' కవిత్వంతో మొదలై.. పాట, కథ, నవల, విమర్శ, పరిశోధనలుగా విస్తరించింది. తమ వృత్తిని, తమ బతుకును, తమ చరిత్రను తామే రాసుకునే సాహిత్య చైతన్యాన్ని బలంగా ఇచ్చింది. ఇది సాహిత్య ప్రక్రియల విస్తరణ మాత్రమే కాదు, ఆధిపత్య సాహిత్యాన్ని ధిక్కరిస్తూ, బిసిలు తమ స్వంత దృక్పథాన్ని నిర్మించుకున్న చరిత్రాత్మక ప్రయాణం ఇది. ఈ పాతికేళ్ల మజిలీ నుండి బిసివాద సాహిత్యంగా తలయెత్తుకుని బిసిల హక్కులు, ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఉద్యమ స్థాయిలో మరింత లోతుగా, విస్తృతంగా రాసుకునే కొత్త దశకు దూసుకుపోవాలని ఆశిద్దాం.

**'వెంటాడె కలాలు – వెనుకబడిన కులాలు' సంకలనం రజతోత్సవ సభ సెప్టెంబర్ 20 న సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్ లో జరుగుతున్న సందర్భంగా**



డా. అట్టెం దత్తయ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఎస్వీ కళాశాల ఢిల్లీ యూనివర్సిటీ
9494715445



# కమల గణనాథుడికి 108 ప్రసాదాలతో నైవేద్యం

- సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ లో నిర్వహణ

**వరంగల్, తెలంగాణ చౌరస్తా :**

నగరంలోని సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అత్యంత వైభవంగా నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాలు ఈ ఏడాది రజతోత్సవ వేడుకలుగా ప్రత్యేకతను సంతరించుకున్నాయి.సంస్థ అధినేత గంట రవికుమార్ సారథ్యంలో 2001లో ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలు ఈ ఏడాదితో విజయవంతంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయి.ఈ సందర్భంగా సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో కొలువుదీరిన కమల గణనాథుడికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తున్నారు.25 సంవత్సరాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమల గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి,108 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు.అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.ఈ ప్రత్యేక నైవేద్య కార్యక్రమంలో భక్తులు,విద్యార్థులు,సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ సిబ్బంది,నగర ప్రజలు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు.ఈ రజతోత్సవ వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సత్యం కంప్యూటర్ ఎడ్యుకేషన్ అధినేత గంట రవికుమార్ తెలిపారు.



# హైదరాబాద్‌లో వర్షం

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో**

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం దంచికొడుతోంది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేటలో భారీవాన కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వర్షం కూడా లెక్కచేయకుండా ఖైరతాబాద్ వినాయకుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సెలవులు కావడంతో పెద్ద సంఖ్యలో బడా గణేష్ చూసేందుకు తరలివచ్చారు. మరోవైపు ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ జామ్ వల్ల వాహనాల బారులు తీరాయి. వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. ఉప్పల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, శంషాబాద్, ఎస్ఆర్‌నగర్, సనత్‌నగర్, మధురానగర్, ఈఎస్ఐ ప్రాంతాల్లో వర్షం పడుతోంది. ఈ వానకు రహదారులు జలమయమయ్యాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా వాన దంచి కొట్టింది. కుండపోతగా కురిసిన వర్షానికి పట్టణంలోని లోతట్టు ప్రదేశాలు, రోడ్లు జలమయమయ్యాయి. వర్ష భావంతో రెండు ముఖం పడుతున్న పంటలకు కురిసిన వర్షం జీవం పోసింది. గత వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడ్డ జనం వర్షం వల్ల చల్లబడిన వాతావరణం ఉపశమనాన్ని ఇచ్చింది. గత కొన్ని రోజుల నుంచి తీవ్రమైన ఎండతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఒక్కసారిగా కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. జగిత్యాల జిల్లా మెట్ పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల పట్టణాల్లో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువ ఉండి ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు వాతావరణంలో ఒకేసారి మార్పులు వచ్చి కుండ పోతగా వర్షం కురిసింది. భారీ ఈదురు గాలులతో పెద్ద ఎత్తున వర్షం సుమారు గంటపాటు కురిసింది. దీంతో మెట్ పల్లి పట్టణంలో పలు వార్డులలో మురుగు కాలువలు సరిగా లేక మురుగు నీరు పెద్ద ఎత్తున రోడ్లమీదకు చేరి వరద పారింది. కూరగాయల మార్కెట్‌లో రైతులు ఇక్కట్లు పడ్డారు. పట్టణంలోని ఇంద్రనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా పెద్ద ఎత్తున వర్షం పడడంతో పిల్లలంతా పుస్తకాలు నెత్తినెత్తుకొని గదుల్లోకి పరుగులు పెట్టారు. సుమారు 180 మంది పిల్లలు రెండు గదుల్లో కిక్కిరిసి తీవ్ర అవస్థలు పడ్డారు.

# నైరుతి రుతుపవనాల తిరోగమనం షురూ

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో**

భారతదేశంలో ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలం ముగింపు దశకు చేరుకుంది. దేశంలో రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. 2026, సెప్టెంబర్ 19న పశ్చిమ రాజస్థాన్‌లోని పలు ప్రాంతాల నుంచి నైరుతి రుతుపవనాలు వెనక్కి వెళ్లినట్లు భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. సాధారణంగా సెప్టెంబర్ 17 నాటికే రాజస్థాన్ నుంచి ఈ నైరుతి రుతుపవనాల ఉపసంహరణ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా, ఈ ఏడాది 2 రోజులు ఆలస్యంగా తిరోగమనం ప్రారంభమైంది. ఐఎండీ ప్రకారం రాబోయే 3 నుంచి 4 రోజుల్లో రాజస్థాన్‌లోని ఇతర ప్రాంతాలతో పాటుగా పంజాబ్, కచ్, సౌరాష్ట్రలోని కొన్ని ప్రాంతాల నుంచి కూడా ఈ రుతుపవనాలు వెనక్కి వెళ్లడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి.

**జూన్ 4న కేరళలోకి ఎంట్రీ- జులై 9న దేశమంతటా విస్తరణ**

ఇక ఈ ఏడాది జూన్ 4న కేరళలోకి తొలుత నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. తర్వాత క్రమక్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించాయి. జులై 9 నాటికి దేశం మొత్తం రుతుపవనాలు వ్యాపించాయి. ఇప్పుడు సెప్టెంబర్ మూడో వారంలో పశ్చిమ రాజస్థాన్ నుంచి నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైంది. అయితే ఈ సారి నైరుతి రుతుపవనాల సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం ఆశించిన స్థాయిలో లేదు. ఐఎండీ డేటా ప్రకారం జూన్ 4 నుంచి సెప్టెంబర్ 19 వరకు దేశవ్యాప్తంగా చూస్తే వర్షపాతం లోటు 15 శాతంగా ఉంది. వర్షపాతం లోటు అధికంగా ఉన్న ప్రాంతాల్లో దక్షిణ ద్వీపకల్పం ఉంది. దేశంలోనే అత్యధికంగా ఇక్కడ ఏకంగా 29 శాతం లోటు వర్షపాతం నమోదైంది.

**ఒక్క జులైలోనే అధిక వర్షపాతం నమోదు**

ఈ రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు జులై నెలలో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. అంటే ఈ ఒక్క నెలలోనే సాధారణ వర్షపాతం కంటే అధికంగా వర్షపాతం (సర్‌ప్లస్) నమోదైందన్నమాట. జులై నెలలో సగటు సాధారణ వర్షపాతం 280.5 మిల్లీమీటర్లు కాగా, ఈ ఏడాది జులైలో ఏకంగా 283.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంతకుముందు జూన్ నెలలో పరిస్థితి భిన్నంగా ఉంది. వాస్తవానికి రుతుపవనాలే పలు ప్రాంతాల్లో కాస్త ఆలస్యంగా వచ్చాయంటే, వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురిశాయి. సాధారణంగా జూన్‌లో 165 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 106.8 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. దీంతో జూన్ నెలలో దేశవ్యాప్తంగా చూస్తే 35 శాతం లోటు వర్షపాతం (డెఫిసిట్) నమోదైంది. గత నెల ఆగస్టులో కూడా పరిస్థితులు ఏమంత మెరుగ్గా లేవు. ఆగస్ట్ 31న ఐఎండీ నెలవారీగా విడుదల చేసే డేటా ప్రకారం చూస్తే ఆగస్టులో దేశవ్యాప్తంగా 213.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఆగస్ట్ నెలలో నమోదైన ఏడో అత్యల్ప వర్షపాతం ఇదే కావడం గమనార్హం.

**ఎల్‌నినో ఎఫెక్ట్‌తోనే లోటు వర్షపాతం**

ఈ 2026 ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షపాతం తగ్గడానికి ప్రధాన కారణాల్లో పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడటం. సదర్న్ ఆసిలేషన్ (ENSO) అనే వాతావరణ వ్యవస్థలోని 3 దశల్లో ఈ ఎల్‌నినో ఒకటి. ఇక్కడ పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పులతో పాటు ఇంకా వాతావరణ మార్పులు కూడా సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల వర్షపాతాలు తగ్గడమే కాకుండా వాతావరణంలో వేడి విపరీతంగా పెరుగుతుంది. సకాలంలో వర్షాలు కురవవు. అదే విధంగా అకాలంగా ఉరుములు, మెరుపులు సహా వడగండ్ల వానలకు దారితీస్తుంది. కొన్ని చోట్ల కురవాల్సిన దాని కంటే తక్కువగా, కొన్ని చోట్ల అకాలంగా కురుస్తుంటాయి. రుతుపవనాలు ముగిసే సమయంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కూడా పడే ప్రమాదం ఉందని గతంలోనే ఐఎండీ హెచ్చరించింది. ఇక ఎల్‌నినోకు వ్యతిరేకంగా ఉండే దశను లానినా (La Nina) అని పిలుస్తారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంటుంది. మధ్యలో న్యూట్రల్ ఫేజ్ కూడా ఉంటుంది.